# ఆ నిషిద్ధ కవితలలో ఏముంది?

***బాంబులు*** *నేను పంచలేదు*
*భావాలూ పంచలేదు*
*ఇనుపబూటుతో నువ్వే*
*చీమల పుట్టను తొక్కితే*
*పుట్టపగిలి పుట్టినవి ప్రతిక్రియాభావాలు*
*తేనెపెరను లాఠీతో*
*ఈడ్చి నువ్వు కొట్టినపుడు*
*తేనెటీగలు చెదిరిన శబ్దం*
*నీ గుండెల్లో బాంబయి పేలింది*
*వణుకుతో కందిన నీ మొహం నిండా*
*భయం దద్దు కట్టింది*
*జనం గుండెల్లో దాగిన జయభేరిని*
*వ్యక్తి అనుకొని నువ్వు తూటాలతో కాల్చావు*
*నలుదిశలా విప్లవం ప్రతిధ్వనించింది*

ఈ కవితను వరవరరావు 1985 జనవరిలో వరంగల్ జైల్లో ఉన్నప్పుడు రాసారు. ఆ తర్వాత వరసగా మూడేళ్ళ పాటు ప్రతి జనవరిలోనూ ఆయన జైల్లోనే ఉన్నారు. మూడు అభియోగాలమీద ఆయన్ని జైలులో పెట్టారు. వాటిని ఒకేసారి కాకుండా ఒకదాని తర్వాత ఒకటి పెట్టారు; తద్వారా ఎంత కాలం వీలయితే అంత కాలం ఆయన్ని జైల్లో ఉంచాలన్నది వాళ్ళ ఉద్దేశం. ఒక అభియోగం మీద బెయిల్ తీసుకుని బయటకు వస్తే, మరొకటి వెంటనే సిద్ధంగా ఉండేది. ఈ అభియోగాల సారాంశం ఏమిటంటే, ఆయన నక్సలైట్ యువకులకు మందుగుండు సామగ్రిని సరఫరాచేసి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసి చంపేందుకు కుట్రపన్నాడని. ఆ ఇన్‌స్పెక్టర్ నిజానికి దాడికి గురికాలేదు; గాయపడనూ లేదు;

---

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో వచ్చిన వ్యాసానికి అనువాదం 28-3-1987

ఇక చనిపోయే ప్రసక్తే లేదు. అందుకే ఈ అభియోగానికి కవితాత్మకంగా స్పందిస్తూ వరవరరావు 'బాంబులు నేను పంచలేదు భావాలూ పంచలేదు' అన్న కవిత రాసారు.

చివరికి ఆ మూడు అభియోగాలలోనూ బెయిల్ వచ్చేసరికి, పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద మరో వారెంట్ తయారు చేసి, ఆయన్ని మరికొంత కాలం జైల్లోనే ఉంచడానికి ప్రయత్నించారు. వాళ్ళు కొంచెం జాగ్రత్తగా ఉండి, ఆ మూడు అభియోగాలనే బెయిల్‌ను వ్యతిరేకించడానికి కారణాలుగా చూపి ఉంటే జిల్లా మేజిస్ట్రేటు తప్పనిసరిగా సంతకం పెట్టి ఉండేవాడు. అయితే పోలీసులు కొంత అత్యాశకు పోయి, మరో అభియోగం జోడించారు; వరవరరావు కొందర్ని చంపడానికి అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లతో కలిసి కుట్ర చేస్తున్నారని. వారి దురదృష్టంకొద్దీ ఆయన కుట్ర చర్చల్లో పాల్గొన్నట్టు పోలీసులు చూపించిన మూడురోజులూ నిజానికి వరవరరావు జైల్లో ఉన్న రోజులే అయ్యాయి. కనుక, జిల్లా మేజిస్ట్రేట్ ఆయన నిర్బంధానికి వారంట్ జారీ చేసేందుకు నిరాకరించాడు. దీనివల్ల, ఇలాంటి మరికొన్ని తప్పిదాల వల్ల, ఆ మేజిస్ట్రేట్ కొంతకాలానికే హైదరాబాద్‌లో ఒక అనామకమైన ఉద్యోగానికి బదిలీ కావాల్సి వచ్చింది.

ఇవాళ మళ్ళీ వరవరరావు సికిందరాబాద్ జైల్లో ఉన్నారు. ఆయన జైలుకు వెళ్ళి కూడా ఏడాది దాటిపోయింది. అయితే ఇది 'స్వచ్ఛంద' నిర్బంధం. మన హంతక పోలీసుల చేతిలో మరణించకుండా ఉండేందుకు ఆయన ఎంచుకున్న మార్గం ఇది. పదేళ్ళుగా నడుస్తున్న సికిందరాబాద్ కుట్ర కేసులో బెయిల్‌ను స్వచ్ఛందంగా రద్దు చేసుకుని తిరిగి జైలుకు వెళ్లారు. అయినప్పటికీ ఈ కవిపై వేధింపులు కొనసాగించడంలో రాజ్యం ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. ఇటీవలి భారతదేశ చరిత్రలో ఆయనంతగా వేధింపులకు గురియైన కవి మరొకరు లేదు. దీనికి పోలీసులు సిద్ధం చేసిన భూమిక ఎలాంటిదో చూడండి. ఒకరోజు ఆయన అసలు కవే కాదని, అలగాజనాన్ని రెచ్చగొట్టే ఉపన్యాసకుడు మాత్రమేనని వరంగల్ ఎస్.పి. పత్రికా సమావేశం పెట్టి మరీ చెబుతాడు; ఇంకోరోజు ప్రభుత్వం ఈ అకవి అకవితా సంకలాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ప్రకటిస్తుంది. కాని రెండు నెలల తర్వాత కూడా ఏ గెజిట్ నోటిఫికేషన్‌లోనూ కనిపించదు.

ఈలోగా, ఆయన జైల్లో ఉండగానే ప్రభుత్వం ఆయన మీద అసాధారణమైన, అత్యంత తీవ్రమైన, చట్టవిరుద్ధమైన అంక్షలు విధిస్తుంది. ఆంధ్రప్రదేశ్ జైళ్ళ

*ఆ నిషిద్ధ కవితలలో ఏముంది?*

నిబంధనావళిలో ఎక్కడ కూడ విచారణ ఎదుర్కొంటున్న ఖైదీ ఏ తరహా సందర్శకులనైనా సరే కలుసుకోకూడదన్న నియమం లేదు. జైలు సూపరింటెండెంట్‌కు ఉన్నదల్లా ఒక నిర్దిష్ట కాలానికి ఇంటర్వ్యూలను రద్దు చేసే అధికారం మాత్రమే; అదీ జైలు క్రమశిక్షణను సదరు వ్యక్తి ఉల్లంఘించి ఉంటే. అంతేకానీ, ఖైదీ రాజకీయ విశ్వాసాలకు సంబంధించిగానీ, అతను లేదా ఆమె ఎదుర్కొంటున్న అభియోగ తీవ్రతకు సంబంధించి గానీ ఎటువంటి శిక్ష వేయడానికి వీల్లేదు. ఇలా కొంతకాలం ఎవరినీ కలుసుకోకుండా నిషేధించే శిక్ష కూడ సునీల్ బాత్రా వర్సెస్ ఢిల్లీ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు చెప్పిన సహజ న్యాయ నియమాలకు లోబడే ఉండాలి. వరవరరావు జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధింపబడిన వ్యక్తి కూడా కాదు. విచారణ ఎదుర్కొంటున్న ఖైదీ మాత్రమే. అయినా భార్యాబిడ్డలను కలుసుకునేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. వాళ్ళు వచ్చినపుడు కూడ, ఒక స్పెషల్ బ్రాంచి పోలీసు అధికారి దాదాపుగా వాళ్ళ మధ్యే కూర్చుని, వారి మధ్య జరిగే సంభాషణంతా రాసుకుంటుంటాడు. మిత్రులు పంపిన పుస్తకాలను ఇవ్వకుండ ఆపేసారు; ఒకే ఒక వార్తాపత్రిక అదీ జైలర్ ఎంపిక చేసిన దాన్నే చదవనిస్తున్నారు.

ఇదంతా పిచ్చిపనిగా, నిర్హేతుక చర్యగా కనిపిస్తోందా; అదే నిజం కూడ. ఈ సంకలనంలోని మరో కవితలో వరవరరావే రాసినట్టు (భూమి అంటే భయం):

*భయపెట్టీ భయపెట్టీ*
*భయం ప్రచారం చేసీ చేసీ*
*వాడు భయానికి భయపడ్డాడు*
*ఊళ్ళను చూసి భయపడ్డాడు*
*స్కూళ్ళను చూసి భయపడ్డాడు*
*నీళ్ళను చూసి భయపడ్డాడు*
*నీడను చూసి భయపడ్డాడు*
*యువకులకు భయపడ్డాడు*
*వాళ్ళ ఊహలకు భయపడ్డాడు*
*కలలకు భయపడ్డాడు*

*కలాలకు భయపడ్డాడు*
*స్వేచ్ఛను బంధించి చివరకు*
*సంకెలల సవ్వడికి భయపడ్డాడు*

కవి ఎదుర్కొన్న వేధింపులకు ఇంతకంటే మంచి వ్యాఖ్యానం ఉండబోదు. బెంజమిన్ మొలైసీకి అంకితం చేసిన మరో కవితలో, కవే దీనికి ఒక సమర్థమైన పరిష్కారం చెపుతాడు.

*అకాల ధర్మం*
*కాలమేఘం కంఠాన్ని నొక్కితే*
*నెత్తురూ కారదు కన్నీరూ రాలదు*
*మెరుపు పిడుగయి*
*చినుకు ఉప్పెనయి*
*కన్నతల్లి కళ్ళు తుడుచుకొని*
*కటకటాల బయటికి*
*కవి సందేశం పాడుతూనే వస్తుంది.*

ఈ వేధింపుకు ఏదో ఒక అర్థం ఉందనుకున్నా, అది ఎంత నిష్ప్రయోజన కరమైనదో కూడ అర్థమవుతున్నా అది నిషేధరూపం ఎందుకు దాల్చాలన్నది ఆశ్చర్యం కలిగించే విషయం. అహంభావి అయిన ఎన్టీ రామారావుకు ఇలాంటి విషయాలు పట్టకపోవచ్చు; ఒక సగటు పోలీసుకు ఇటువంటి రచయితలపట్ల ద్వేషం ఉండవచ్చు (వీరి ద్వేషంలోని తీవ్రత అనుభవించిన వారికే తెలుస్తుంది); వారి అభిప్రాయాలు పోలీసు ఉన్నతాధికారులను కూడ ప్రభావితం చేయవచ్చు; కానీ ఎన్టీ రామారావు కొలువులో ఉన్న ఒక అధికారో, సలహాదారో ఎవరో ఒకరు (గతితార్కిక భౌతికవాదాన్ని నమ్ముతున్నామని చెప్పే స్నేహితులు కూడా ఆయనకు ఉన్నారు కాబట్టి వారికైనా కొద్దో గొప్పో చరిత్ర తెలిసివుండాలే) ఎన్టీఆర్‌కు ఒక మాట చెప్పే ఉండాలి. అత్యంత అసాధారణ పరిస్థితులలో కూడా కవిత్వంపై నిషేధం విధించడాన్ని ప్రజలు ఏనాడూ సహించలేదని. అయినా నిషేధాన్ని కొనసాగించాలనే నిర్ణయించారంటే, ఆ కవిత్వంలో ఏదో పదును వారిని అతి సున్నితమైన చోట తగిలి గాయపరచిందన్నమాట. అహంభావపూరితమైన

*ఆ నిషిద్ధ కవితలలో ఏముంది?*

ఎన్టీరామారావు పాలనాయంత్రాంగంలో సున్నితమైన చోటు అంటే పోలీసు వ్యవస్థ. దాన్ని గనక మనం గుర్తిస్తే, ఈ వేధింపులకు అసలు కారణం అర్థం అవుతుంది.

నిషేధానికి గురయిన వరవరరావు కవితా సంకలనం పేరు 'భవిష్యత్ చిత్రపటం'. ఇందులోని ఘాటయిన కవితలన్నీ విప్లవాన్ని గురించినవి కావు; పోలీసు చిత్రహింసలు, హత్యలకు సంబంధించినవి. వాటి గురించి కూడా బీభత్సమయిన వర్ణనలేమీ లేవు. (నిజానికి సంస్కృతభూయిష్టమయిన మన తెలుగు సాహిత్య భాష అందుకు చాలా చక్కగా సరిపోతుంది.) ఈ కవితలు వ్యంగ్యంగా, ఆర్ద్రంగా ఉంటూనే ఆగ్రహం వ్యక్తం చేసేవి. వరవరరావు కవితలకు అసాధారణ వేగంతో ప్రవహించి చురుక్కుమనిపించే లక్షణం ఉంది. నేను కవినీ కాను; సాహిత్య విమర్శకుడినీ కాను గనక, మార్క్సిస్ట్ కవిత్వమంటే బహుశా ఇలా ఉండాలని చెప్పలేను. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలంటే ఈ కవిత్వాన్ని మరింత విస్తృతంగా అధ్యయనం చేయాలని మాత్రం చెప్పగలను.

ఎన్టీఆర్ ప్రభుత్వానికి కచ్చితంగా బాధ కలిగించి ఉండే కవిత 'కసాయి'. కామారెడ్డిలో 1985 మే 15 వ తేదీన ఒక 'రాడికల్' యువకుడిని పోలీసులు చంపుతుండగా ఒక కసాయివాడు చూస్తూ చెప్పినట్టు రాసిన కవిత ఇది. జూనియర్ కళాశాల విద్యార్థి అయిన ఆ అబ్బాయి ఎన్‌కౌంటర్ మరణాలను వ్యతిరేకిస్తూ, దుకాణాలను మూయిస్తున్నప్పుడు పోలీసులు పట్టుకున్నారు. ఆ యువకుడిని చౌరస్తాలోకి తీసుకువెళ్ళి, అందరూ చూస్తూండగా 'పామును చావగొట్టినట్టు' రైఫిళ్ళతో బాదారు. వరవరరావు ఆ కవితలో ఇలా అంటారు:

*నేను కటికవాణ్ణి*
*కసాయివాణ్ణి అంటారా*
*పోనీ మీ ఇష్టం అనండి*
*రోజూ జీవుల్ని చంపుతూనే వుంటాను*
*పోగులేసి అమ్ముతూనే వుంటాను*
*నెత్తురు కళ్ళ చూడడం నాకు కొత్త కాదు.*
*కానీ*
*కసాయితనమేమిటో మాత్రం*

*ఆరోజు కళ్లారా చూసాను*

*..............................*

*నేనూ జీవుల్ని చంపుతాను*

*నాకు వాటి మీద ఏ కోపమూ లేదు*

*నేను మాంసం అమ్ముకుంటాను*

*కానీ నన్ను నేను ఎప్పుడూ*

*ఎవరికీ అమ్ముకోలేదు*

*..............................*

*రోజూ బకరాలను చంపే నాకు*

*కుట్రగా కూడబలుక్కుని*

*ప్రాణలు తీసే క్రౌర్యం ఎట్లా వుంటుందో*

*ఆ రోజే తెలిసింది*

ఈ మాటలు కవివే అయినా, ఆలోచనలు కసాయివాడివే; ఈ కేసులో కామారెడ్డి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఎదుట అతను చెప్పిన సాక్ష్యం బహుశా చాలా అరుదైన సాక్ష్యం అయ్యుంటుంది.

దీనికంటే కూడ బహుశా పాలకులను కలవరపరచిన కవిత 'స్వేచ్ఛా నృత్యం.' కరీంనగర్ జిల్లాలో ఎన్‌కౌంటర్లు, ఇతర అమానుష హింసాకాండ తారాస్థాయికి చేరుకున్న రోజుల్లో రాష్ట్ర హోంమంత్రి ఇచ్చిన ఉపన్యాసానికి స్పందనగా వరవరరావు రాసిన కవిత ఇది. ఆ ఉపన్యాసంలో హోంమంత్రి వసంత నాగేశ్వరరావు ఇప్పుడు రాష్ట్రంలో భద్రత నెలకొన్నదనీ, ప్రజలంతా స్వేచ్ఛగా జీవించవచ్చుననీ చెప్పారు. ఇందులో హోంమంత్రి పేరులోని 'వసంత' పదాన్ని కవి చక్కగా వాడుకున్నారు. ఆ కవితలో వసంత దేవత, ఒకానొక హింసాత్మక మనఃస్థితిలో, స్వేచ్ఛా నర్తకిని రక్తంతో హోలీ ఆడుకోవడానికి ఆహ్వానిస్తుంది.

*స్వేచ్ఛా నర్తకీ*

*నృత్యం చెయ్యి*

*నీకోసం శాంభ వేదిక నిర్మించాను*

*శ్మశాన వాటిక నిర్మించాను*

*....................................*

*ఆ నిషిద్ధ కవితలలో ఏముంది?*

*నా పడగనీడన*
*నా పదవి నీడన*
*నా పదవికి గొడుగుపట్టిన*
*పాలకుల నీడన*
*స్వేచ్ఛానర్తకీ*
*నృత్యం చెయ్*

ఈ కవితలో ఆ రోజుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లు ఒక్కొక్కటినీ వర్ణిస్తూ, పోలీసుల రక్తదాహాన్ని, కర్కశత్వాన్ని ఎంత శక్తిమంతమైన భావచిత్రాలతో సాక్షాత్కరింపజేస్తాడంటే మన రాష్ట్ర పాలకుల వంటి స్థాయి ఉన్నవారు అతని కవిత్వాన్నంతటినీ నిషేధించాలని తప్ప మరోరకంగా స్పందిస్తారని ఊహించలేం.

రాజ్యాన్ని ఏది గాయపరచి వుంటుందీ అన్నది కూడా మన ఊహ మాత్రమే. వారు ఏ కారణాలు చూపి కవిత్వాన్ని నిషేధించదలచుకున్నారో మనకు ఇప్పటికీ తెలీదు. కోర్టులో దాన్ని సవాలు చేసేందుకోసం తప్ప ఆ విషయం తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు మనకు. తమ అభియోగంలో వాళ్ళు తప్పకుండా నిషేధానికి అర్హమైనవిగా వారు భావించే కారణాలనే చూపిస్తారు. అయినా, మన దేశంలోని న్యాయస్థానాలు భావప్రకటనా స్వేచ్ఛ విషయంలో ఏనాడూ విస్పష్టమైన వైఖరిని తీసుకోలేదు. ఈ బూర్జువా నాగరికతా వ్యవస్థలోని అన్ని ప్రాథమిక స్వేచ్ఛా సూత్రాల్లాగే భారత రాజ్యాంగంలోని 19వ అధికరణ కూడా – స్వేచ్ఛను అరికట్టడానికి ఉద్దేశించిన (2) నుండి (6) క్లాజులు అమలయినంతగా – అసలు ఆ స్వేచ్ఛను అనుమతించే 19 (1) అధికరణ అమలు అవలేదు. కనక, వరవరరావు కవితా సంపుటిపై నిషేధం కొనసాగే అవకాశాలే ఎక్కువ. అయితే, (మీరు ఇంతవరకు కనీవినీ ఎరగని అసంబద్ధమైన కొసమెరుపు ఇప్పుడు వస్తుంది) ఇప్పటికే ఈ సంపుటిలోని కవితలన్నీ అన్ని పత్రికల్లోనూ ప్రచురింపబడ్డాయి. పాఠకులు వీటిని చదివారు. మళ్ళీ మళ్ళీ కూడా చదివారు; గుర్తుపెట్టుకుని ఉటంకిస్తున్నారు. ఎన్నో దినపత్రికలు ఈ సంపుటిని ఇప్పటికే సమీక్షించాయి కూడ. అయినా ఈ తర్కమంతా ఫ్యూడల్ అహంకారం ముందు నిలవదని రుజువయింది.